క్లుప్తంగా

6 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోతిరెడ్డి సదయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి సదయ్యపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో అపోలోరిచ్ ఎన్ఎస్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జావీద్ 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అత్యవసర వైద్య సేవలకు ఎన్ఎస్ఆర్ ఆస్పత్రికి పంపించారు. పరకాల పట్టణానికి చెందిన సంధ్య నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఆర్ జనరల్ మేనేజర్ సుమన్‌రావు, వైద్య సిబ్బంది అజయ్, స్వాతి, సోనా, శ్రీలక్ష్మి, కుమార్, హరికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



వేలేరు : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వాలీబాల్ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మంగళవారం బీఆర్ఎస్ యువజన నాయకుడు ఇట్టబోయిన సంపత్ టీషర్ట్స్ పంపిణీ చేశారు. యువకులు క్రీడల్లో రాణించాలని కోరారు. ప్రతిభావంతులైన యువతను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



ఐనవోలు : తప్పిపోయిన బాలికను మంగళవారం ఎస్సై పస్తం శ్రీనివాస్ బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంథిని గ్రామానికి చెందిన జన్ను రాజు కుమార్తె సమత జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో బాలిక ఆదివారం తల్లిదండ్రులతో గొడవపడి ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సోమవారం బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి 24 గంటల్లో బాలికను వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కాగా వేగంగా స్పందించి బాలికను వారి తల్లిదండ్రులకు అప్పగించినందుకు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్ ఎస్సై శ్రీనివాస్‌ను అభినందించారు.

మతిస్థిమితంలేని వ్యక్తి ఎర్రగడ్డకు తరలింపు

కమలాపూర్ : మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన మామిడాల సత్యనారాయణ (35)ను మంగళవారం ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ మతిస్థిమితం సరిగా లేక గ్రామస్తులపై రాళ్లు, కర్రలతో దాడి చేస్తూ రాత్రి వేళల్లో ఇళ్ల తలుపులు కొడుతూ భయాందోళనకు గురి చేస్తున్నాడని తెలిపారు. అతని సోదరుడు సాంబయ్య ఫిర్యాదు మేరకు సత్యనారాయణకు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి హనుమకొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పర్చినట్లు తెలిపారు. మెజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు సత్యనారాయణను హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మెంటల్ హెల్త్ కేర్ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

కాజీపేట అర్బన్ : బీఎస్ఆర్‌కేఎస్ శిక్షణ తరగతులను ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్నట్లు బీఎస్ఆర్‌కేఎస్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ పంకెర్ల కుమారస్వామి తెలిపారు. కడిపికొండలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగాం జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న శిక్షణా తరగతులకు భవన నిర్మాణ రంగ కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధికి దూరంగా దళిత కాలనీలు



కంకర పోసి వదిలేసిన మల్బరీ తోటకు వెళ్లే కాలనీ రోడ్డు



దళిత కాలనీకి వెళ్లే రోడ్డుగుండా పెరిగిన చెట్లు

- రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ఆగ్రహిస్తున్న కాలనీవాసులు

పరకాల : పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పట్టణంలోని దళిత కాలనీలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. పట్టణంలోని పలు కాలనీలు మారుమూల అటవీ ప్రాంతాలను తలపిస్తున్నాయి. 1, 2వ వార్డులో గల దళిత కాలనీల్లో చాలా చోట్ల రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీలోని దారుల వెంబడి చెట్లు పెరిగాయి. రాత్రి వేళల్లో వీధిలైట్లు వెలుగకపోవడంతో కాలనీవాసులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. అదే విధంగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో వరద నీరు ఇళ్లలోకి చేరుకుంటుందని కాలనీవాసులు వాపోతున్నారు. స్థానిక కౌన్సిలర్స్‌ను ప్రశ్నిస్తే అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు పంపామని చెబుతూ ఏళ్లుగా నెట్టుకొస్తున్నారని ఆగ్రహిస్తున్నారు. భారీగా పెరిగి చెట్లు, అస్తవ్యస్తమైన డ్రెయినేజీ కారణంగా దోమలు వ్యాప్తి పెరిగి అనేక మంది మలేరియా బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే



మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే, పక్కన ఏసీపీ సతీష్‌బాబు, తదితరులు

ఆత్మకూరు : ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అక్కంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవుల అవసరానికి చదువు, ఆహారం, ఆరోగ్యం ఎంత అవసరమో భద్రత, రక్షణ కూడా అవసరమేనన్నారు. ప్రస్తుతం అభివృద్ధి దిశగా విద్య, వైజ్ఞానిక రంగంలో ఎదుగుతున్నామన్నారు. అన్ని విషయాల్లో ఈ పరిస్థితి ఉండాలన్నారు. సమాజంలో, కుటుంబాల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు అందరికి న్యాయ విజ్ఞానం అవసరమన్నారు. సమస్యలను ఎదుర్కొనేందుకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. అత్యవసర న్యాయ సహాయం కోసం పనిచేసే వ్యవస్థల సహకారం పొందవచ్చని, గ్రామాల్లో చైతన్యం పొందిన నాయకులతో సాధ్యపడుతుందన్నారు. అనంతరం పరకాల ఏసీపీ సతీష్‌బాబు మాట్లాడుతూ.. ఆడవారికి, మగవారికి సమాన న్యాయం, రక్షణ అవసరమని, వాటిని కల్పించే సంస్థల గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. మహిళలకు వివక్ష, హింసలేని సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు వివిధ కార్యక్రమాలు చేస్తున్నామని సర్వోదయ సంస్థ కార్యదర్శి డాక్టర్ దామోదర్ అన్నారు. సీఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



కమలాపూర్ : నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు



శాయంపేట : డాక్టర్ సాయికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

కమలాపూర్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రచురించిన ప్రకారం ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు అనిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.18 వేల వేతనం చెల్లించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న ఆశాలను పోలీసులు అడ్డుకుని దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం మండలంలోని ఆశ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక పీహెచ్‌సీ ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అనిత మాట్లాడుతూ.. మహిళలు అని చూడకుండా పోలీసులు దుర్భాశలాడుతూ ఆశ కార్యకర్తలపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసుల దాడిలో ఆశ కార్యకర్తలు గాయపడి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారు కోలుకుని ఇళ్లకు చేరేవరకు తాము విధులకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు వైద్యాధికారి డాక్టర్ మాధవికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమలత, సంతోష, రమాదేవి, సునీత, సంధ్య, మౌనిక, రజిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాయంపేట : వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఆశ కార్యకర్తలకు నెలకు 18వేల గ్యారంటీ వేతనం చెల్లించాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల వైద్యాధికారి సాయికృష్ణకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల ఆశ కార్యకర్తలను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మంగళవారం హైదరాబాద్ కమిషనరేట్ ముట్టడికి వెళ్లకుండా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆశ కార్యకర్తల యూనియన్ ప్రతినిధులు బైరి శోభ, పద్మ, మంజుల, శాంత, స్వప్న, శ్రీలత, సుశీల పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు

ఐనవోలు : నేడు మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల నుంచి ఎంపికైన క్రీడాకారుల లిస్ట్‌ను మండల కన్వీనర్‌కు సమర్పించాలని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, సంక్షేమ, గురుకుల వసతి గృహాల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

కేసీఆర్‌ను విమర్శించే స్థాయి కాదు



విలేకరులతో మాట్లాడుతున్న దుర్వేష్

కమలాపూర్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఏఎంసీ చైర్‌పర్సన్ తొటం ఝాన్సీరాణికి లేదని బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ నాయకుడు దుర్వేష్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్‌ను చులకన చేసి మాట్లాడడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. పదవులను కాపాడుకునేందుకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణ తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఝాన్సీరాణి ఎక్కడ ఉన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కమలాపూర్ సబ్ మార్కెట్ యార్డును మార్కెట్ యార్డుగా అప్‌గ్రేడ్ చేసింది కేసీఆర్ హయాంలోనేనని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, సీసీఐని కమలాపూర్‌కు తీసుకొచ్చి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మాట్ల శ్రీధర్, సాంబయ్య, వెంకటేష్, ప్రశాంత్, రాజు, దినేష్, వినయ్, వినయ్ పాల్గొన్నారు.

క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి



ఎల్కతుర్తి : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ సీఈఓ విద్యాలత



ఆత్మకూరు : క్రీడాకారులతో అధికారులు



పరకాలలో..

- జెడ్పీ సీఈఓ విద్యాలత

ఎల్కతుర్తి : క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందుతుందని జెడ్పీసీఈఓ విద్యాలత అన్నారు. మంగళవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్‌లో సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ వీరేశం, ఎస్సై సాయిబాబు, స్థానిక కాంగ్రెస్ నాయకులు అయిలయ్య, రాజు, రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ అశోక్ నాయక్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, సీఐ పులి రమేష్, ఎస్సై గోదారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

శాయంపేట : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ ఫణిచంద్ర అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్లు గీత, కమలాకర్, రంజిత్, కుమార్, జ్యోతి, తరంగిణి, సత్యనారాయణ, మమత, సతీష్ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో క్రీడా పోటీల కన్వీనర్, ఎంపీడీఓ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి ప్రశాంత్, తహసీల్దార్ సదానందం, సీఐ ప్రవీణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం మురళి, ఎంపీఓ అఫ్జల్, పీఈటీలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాల : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత మంగళవారం ప్రారంభించారు. క్రీడాల్లో పాల్గొన్న విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. మూడురోజుల పాటు జరుగనున్న క్రీడల్లో ప్రతిభావంతులను గుర్తించి ప్రశంస పత్రాలు, బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శైలజ, ఎస్సై శివకృష్ణ, ఎంఈఓ రమాదేవి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం గౌస్‌పాషా, కౌన్సిలర్స్ సంపత్‌కుమార్, ఉమాదేవి, జ్యోతి, రాజు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలో మంగళవారం సీఎం కప్ క్రీడా పోటీలను మండల స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ బాలరాజు ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడలను ఆడించారు. స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మి దేవి, ఎంఈఓ రాజేష్‌కుమార్, ఎంపీఓ రంగాచారి, దేవేందర్, లక్ష్మి, నారాయణ, రాజేశ్వర్, రమేష్, మనోహర్, నరేష్, సరళ తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించే మండలస్థాయి సీఎం కప్ పోటీలను అధికారులు మంగళవారం ప్రారంభించారు. తహసీల్దార్ కోమి, ఎంపీఓ విమల, ఎస్సై సురేష్, హెచ్ఎం రాజన్న, గురుకుల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సద్దాంహుస్సేన్, ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని స్పోర్ట్స్ కమిటీ మండల చైర్మన్, మండల ప్రత్యేకాధికారి రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మంగళవారం సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ విజయ్‌కుమార్, ఎంపీఓ విమల, ఫిజికల్ డైరెక్టర్‌లు గ్రేసి, రజిత, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- జీఎంపీఎస్ మండల కార్యదర్శి చిన్నరాజు



మాట్లాడుతున్న నల్లబెట్ల చిన్నరాజు

ఐనవోలు : గొర్రెల, మేకల పెంపకందారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జీఎంపీఎస్ మండల కార్యదర్శి నల్లబెట్ల చిన్నరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 19వ తేదీన చలో హైదరాబాద్ నిరసన కార్యక్రమానికి గొర్రెల కాపర్లు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ నిలిపివేయడమే కాకుండా కాపరుల సంక్షేమాన్ని కూడా మరిచిందన్నారు. పశు వైద్యుల ఖాళీలను భర్తీ చేయకపోవడంతో గ్రామాల్లో మూగజీవాల సంరక్షణ ఇబ్బందిగా మారుతుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీతో పాటు పలు న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. నాయకులు భాస్కర్, రాజు, సాయిలు, భిక్షపతి, కట్టయ్య, యాకయ్య, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- డాక్టర్ ప్రహసిత్



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రహసిత్

ఆత్మకూరు : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు మార్గానికి దరిచేరకుండా చదువుపై దృష్టిసారించాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఛేదించాలంటే మంచి జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. బయటి తినుబండరాలు తినొద్దని, ఇంట్లోని ఆహారం తినాలని అన్నారు. వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు ఆరోగ్యసూత్రాలు పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ బి.ఎస్.రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్పందన, సిబ్బంది పాల్గొన్నారు.

రాజేందర్‌కు జాతీయ అవార్డు



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మంటి రాజేందర్‌ను సేవా రత్న జాతీయ అవార్డు వరించింది. ఐటీఐ పూర్తి చేసి జెన్కోలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న ఆయన.. తోటి కార్మికుడికి కిడ్నీ ఫెయిల్యూర్ అవడం, డయాలసిస్ చికిత్సకు డబ్బులు లేకపోవడంతో స్పందించిన రాజేందర్ తోటి కార్మికుల సహాయంతో రెండున్నర లక్షలు పోగుచేసి బాధిత కుటుంబానికి అందించాడు. అలాగే పలు సేవా కార్యక్రమాలు చేయగా గుర్తించిన బహుజన సాహిత్య అకాడమి సంస్థ ఈనెల 15వ తేదీ దేశ రాజధాని న్యూఢిల్లీలో 5వ నేషనల్ కాన్ఫరెన్స్ సమావేశంలో సేవారత్న నేషనల్ అవార్డును అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్‌ను పలువురు అభినందించారు.

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ధర్మసాగర్ : పాఠశాల దశలోనే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించేలా ఉపాధ్యాయులు చైతన్య పర్చాలని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ధర్మప్రకాశ్ అధ్యక్షతన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారానికి విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం ఎంఈఓ రాంధన్ మాట్లాడుతూ.. పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకుంటే నిత్యజీవితంలో ఎదురయ్యే సంక్లిష్ట సమస్యలు సులువుగా పరిష్కరించుకుంటారని అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు శ్యాంసుందర్, రవీందర్, యమునశ్రీ, పీఎస్ హెచ్ఎంలు ఆంజనేయులు, వాలియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

నడికూడ : హనమకొండ డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి నడికూడకు వచ్చేది. కానీ వారం రోజులగా రద్దు చేశారు. మండల కేంద్రం నుంచి వరంగల్‌కు వయా కంఠాత్మకూరు, రామకృష్ణపూర్, మల్లారెడ్డిపల్లి, కోగిల్వాయి, ఆర్వపల్లి, సిద్ధాపురం, వంగపాడు, ఆరెపల్లి మీదుగా రోజుకు నాలుగు ట్రిప్పులు వచ్చేది. కానీ వారం రోజుల నుంచి రాకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

తెలంగాణతల్లి రూపాన్ని మార్చడం సరికాదు



ఎల్కతుర్తి : ముల్కనూరులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



ఐనవోలులో..



పరకాలలో..

ఎల్కతుర్తి : బీఆర్ఎస్ హయాంలో రూపకల్పన చేసిన తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని ప్రస్తుత ప్రభుత్వం మార్చడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండలంలోని జీల్గుల గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి పాత విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఇతర రాష్ట్రాలు మెచ్చుకున్నాయని అన్నారు. అలాంటి విగ్రహానికి రూపం మార్చడం విడ్డూరంగా ఉందని అన్నారు. మార్పు అంటే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల జీవితాల్లో మార్పు తేవాలని, కానీ విగ్రహాల రూపాన్ని మార్చడం కాదన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మహేందర్, మాజీ ఎంపీపీ అనిత, మాజీ జెడ్పీటీసీ రవీందర్ పాల్గొన్నారు.

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో గతంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. పార్టీ పెద్దల ఆదేశానుసారం కార్యక్రమం చేపట్టినట్లు నాయకుడు తక్కళ్లపెల్లి చందర్‌రావు, మోహన్, ఉస్మాన్‌అలీ తెలిపారు.

పరకాల : తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి పాత చిత్రపటానికి పాలభిషేకం చేశారు. బస్టాండ్ కూడలిలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మదుసూధన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ నడికూడ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి, కుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి నెబులైజర్ల అందజేత



కమలాపూర్ : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మండలంలోని గూడూరుకు చెందిన బీజేపీ హనుమకొండ జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి బండి వినయ్‌సాగర్ మంగళవారం రూ.7 వేల విలువ చేసే రెండు నెబులైజర్ మిషన్లు అందించారు. వాతావరణ మార్పులు, చలి తీవ్రత వలన ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారులు, వయో వృద్ధులు శ్వాసకోశ సమస్యతో ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున నెబ్యూలైజర్లు అందించినట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు. వినయ్‌సాగర్‌ను పలువురు అభినందించారు. బీజేపీ నాయకులు జూపాక అనిల్, మధు తదితరులు పాల్గొన్నారు.